క్లుప్తంగా

గుడుంబా ధ్వంసం చేసిన గ్రామస్తులు

చర్ల: మండలంలోని లింగాపురంపాడుకు చెందిన జనాంగం గుడంబా నియంత్రణకు నడుం బిగించారు. గ్రామాంలో విచ్చల విడిగా సాగుతున్న కొనసాగుతున్న గుడంబా వల్ల చిన్నాభిన్నమవుతున్న కుటంబాల పరిస్థితిపై ఆందోళన చెందుతున్న గ్రామంలోని యువకులు, మహిళలు గడుంబా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో చేయి చేయి కలాపారు. గ్రామానికి ద్విచక్రవాహనాల ద్వారా రవాణా అవుతున్న మద్యాన్ని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. శుక్రవారం గ్రామంలో మద్యం విక్రయాలు సాగిస్తున్న ఇళ్లలో సోదాలు నిర్వహించి దాచి ఉంచిన నాటుసారాను పారబోశారు. గ్రామంలో మద్యం విక్రయించినా ఊరుకునేది లేదంటూ ఈ సందర్భంగా యువకులు, మహిళలు విక్రయదారులను హెచ్చరించారు.

కలశ ప్రతిష్ఠాపనలో మంత్రి, ఎమ్మెల్యే



నాచారం జయలింగేశ్వరుడి ఆలయంలో మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం గ్రామంలో గుట్టపై ఉన్న జగదాంబ సమేత జయలింగేశ్వరస్వామి ఆలయ శ్రీచక్ర రాజగోపుర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు పాల్గొన్నారు. శుక్రవారం ఆలయ సందర్శనకు విచ్చేసిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే, ఇరిగేషన్ చైర్మన్ మువ్వాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులచే పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. జయలింగేశ్వరుడికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... జగదాంబ సమేత జయలింగేశ్వరుని కరుణ కటాక్షాలతో పాడి పంటలు, సిరులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరారు. ఆలయ శిఖరం (రాజగోపురం) పైకి ఎక్కిన ఎమ్మెల్యే జారే, శిఖరంపై కలశ ప్రతిష్ఠాపనలో స్వయంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి భవానీ శంకర్, ఎస్పీఎఫ్ కమాండెంట్ నరుకుళ్ల త్రినాథ్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దినిగా అమ్మవారు

దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మండపాల్లో శుక్రవారం అమ్మవారు మహిషాసుర మర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణాలు, మండపాల్లో వేదపండితులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని అర్చకులు పట్టుచీరెలు, పూలు, అభరణాలతో ముస్తాబు చేసి, మహిషాసుర మర్దినిగా అలంకరించారు. నిర్వాహన కమిటీ బాధ్యులు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యక్రమాలో పాల్గొని పూజలు చేశారు. అన్నప్రసాద కార్యక్రమాలను ప్రారంభించారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: మహిషాసురమర్దిని దేవి అలంకరణలో అమ్మవారు



దమ్మపేట: గాయత్రి ఆలయంలో హోమం..



భద్రాచలంటౌన్: భగవాన్‌దాస్ కాలనీలో అన్నప్రసాద వితరణ..



అశ్వారావుపేట కనకదుర్గమ్మ ఆలయంలో..



ములకలపల్లి: దుర్గామాత వద్ద పూజలు..

కోర్టు అభివృద్ధికి రూ.1.65కోట్లు మంజూరు



కోర్టు పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్టు అభివృద్ధి పనులకు కోటీ 65లక్షల రూపాయల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా నిధులతో కోర్టుకు ప్రహారీ గోడను నిర్మించడంతో పాటు కోర్టు భవనంలో పలు మరమ్మతులకు, రహదారి సౌకర్యం ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఆర్‌అండ్‌బీశాఖ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమెట్ల శ్రీనివాస్‌లు కోర్ట్ ఆవరణలో కలియ తిరిగి పరిశీలించారు. కోర్ట్ ప్రాంగణంలోని కోడిపుంజుల వాగును, పరిసరాలను సైతం పరిశీలించారు. జిల్లా జడ్జితో చర్చలు జరిపి మంజూరైన నిధులతో కోర్ట్ అభివృద్ధి పనుల నిర్వహించనున్నట్లు ఆర్‌అండ్‌బీశాఖ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె.విజయ్‌రావు, మధు, కోర్ట్ సిబ్బంది శ్రీకర్ పాల్గొన్నారు.

రైలు పునరుద్ధరణపై హర్షం

మణుగూరుటౌన్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మెనేజర్‌కు మణుగూరు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలుమార్లు ఇచ్చిన వినతి మేరకు పరిస్థితిని సమాలోచన చేసి అధికారులు బెల్గావి రైలు పునరుద్ధరించడం అభినందనీయమని ఏఐటీయూసీ బ్రాంచి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం యూనియన్ నాయకులు ఓ ప్రకటనలో విడుదల చేశారు. మణుగూరు–సికింద్రాబాద్ మీదుగా కర్ణాటక వరకు వెళ్లే ఈ రైలు లేకపోవడంతో తాము ఈ ప్రాంత వాసులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈనెల 17వ తేదీ నుంచి బెల్గావి రైలు వారానికి నాలుగు రోజులు నడపాలని సర్క్యులర్ జారీ చేయడంపై దక్షిణ మధ్య రైల్వే అధికారులకు బ్రాంచ్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా కాకతీయతో పాటు మిగతా రైల్వే సర్వీసులను త్వరలో మణుగూరు ప్రజలకు త్వరలో అందుబాటులోకి తెస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వై.రాంగోపాల్, నాయకులు ఆవుల నాగరాజు, మల్లెల రామనర్సయ్య, ఆదర్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మణుగూరుటౌన్: ముత్యాలమ్మనగర్‌లోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలోని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయంలో పుస్తకాల లేకపోవడంతో నిరుద్యోగులు, విద్యార్థులు, మేథావులు పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి రావడంతో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి 450 విలువైన పుస్తకాలతో కూడిన గ్రంథాలయం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, సువిశాల ప్రదేశంతో కూడిన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గ్రంథాలయంలోని లోటుపాట్లు అధికారులు గుర్తించి వెంటనే తన దృష్టికి తీసుకువస్తే నియోజకవర్గ నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అవసరమైన పుస్తకాలు పోటీ పరీక్షలకు ఈ ప్రాంతానికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. గ్రంథాలయ పుస్తకాలు, అవసరమైన సామగ్రి సేకరణలో తహసీల్దార్ రాఘవరెడ్డి కృషిని అభినందించారు. అనంతరం అందుబాటులో ఉన్న పుస్తకాలను పరిశీలించి ఆవరణలో హరితహారం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, గణేశ్‌రెడ్డి, సామా శ్రీనివాసరెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, నాయకులు జీవీ, గాండ్ల సురేశ్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

మణుగూరు స్పోర్ట్స్ గ్రౌండ్‌లో గంట్ల కోటేశ్వరరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన అశ్వాపురం–11 విన్నర్, మణుగూరు మ్యాగీ జట్టు రన్నర్‌లకు మొదటి బహుమతి 25వేలు, షీల్డ్‌తో పాటు రెండో బహుమతి 15వేలు చెక్కు, షీల్డ్‌లను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 7రోజుల పాటు హోరాహోరీగా జరిగిన క్రికెట్ పోటీల్లో మొత్తం నియోజకవర్గం నుంచి 57 జట్లు పాల్గొనడం సంతోషించదగిన విషయమన్నారు. నిర్వాహకుడు గంట్ల రమేశ్‌ను అభినందించారు. మండల నాయకులు, పార్టీల బాధ్యులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

చర్ల: వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న చర్లలోని కొమరంభీం విద్యార్థి నిలయానికి చర్లకు చెందిన చుక్కబొట్ల విజయలక్ష్మి శుక్రవారం క్వింటా బియ్యాన్ని వితరణగా అందజేశారు. విజయలక్ష్మి భర్త చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దివంగత చుక్కబొట్ల ఆంజనేయులు 4వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వనవాసీ కల్యాణ పరిషత్ ప్రాంతీయ మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, జవ్వాది మురళీకృష్ణ, గోగికార్ రామలక్ష్మణ్, వేములపల్లి ప్రవీణ్, బందా స్వరూపరాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నియామకానికి 21న ఇంటర్వ్యూలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యుల ఖాళీల భర్తీకి కాంట్రాక్టు పద్ధతిన వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యశాల వద్ద రేడియాలజీ-2, జనరల్ ఫిజిషియన్-1 ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి గల వైద్యులు రేడీయాలజీ పోస్టు కొరకు ఎండీ, డిప్లొమా, జనరల్ ఫిజిషియన్ కొరకు ఎండీ అర్హత గల అభ్యర్థులు ఈనెల 21న ఒరిజనల్, అనుభవ ధ్రువీకరణ పత్రాలతో భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో జరిగే వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. నియామకం అనంతరం రేడియాలజీ స్పెషలిస్టు వైద్యులకు రూ.2 లక్షలు, జనరల్ ఫిజిషియన్ స్పెషలిస్టు వైద్యులకు రూ.1.50 లక్షలు నెలవారి వేతనం చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు.